

ఐటీ దాడుల్లో స్వాధీనం చేసుకున్న డబ్బును లెక్కిస్తున్న అధికారులు

# కాంగ్రెస్ ఎంపీపై ఐటీ దాడులు.. రూ.351 కోట్లు స్వాధీనం

**ఇంత పెద్ద మొత్తం పట్టుబడటం దేశంలో ఇదే ప్రథమం**

ఢిల్లీ/భువనేశ్వర్, డిసెంబర్ 10: కట్టల కట్టల డబ్బు.. లెక్కపెట్టలేక మొరాయించిన కౌంటింగ్ మెషీన్లు.. ఒడిశాలోని మద్యం డిస్టిలరీలపై ఆదాయపు పన్ను శాఖ దాడుల సందర్భంగా అధికారులకు ఎదురైన అనుభవమిది. కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహూ, ఆయన బంధువులకు చెందిన మద్యం వ్యాపార సంస్థలపై జరిగిన ఈ దాడుల్లో నగదు కట్టలు కట్టలు బయటపడ్డాయి.

మొత్తం పట్టుబడ్డ నగదు 351 కోట్ల రూపాయలని అధికారులు ప్రకటించారు. ఐటీయే కాదు, ఏ ఇతర దర్యాప్తు సంస్థలు కూడా ఏకదాడిలో ఇంత పెద్దమొత్తంలో అక్రమ సొమ్మును స్వాధీనం చేసుకోవడం దేశంలో ఇదే ప్రథమమని అధికారులు చెబుతున్నారు.

### రికార్డు స్థాయిలో..

గతంలో 2019లో కాన్పూర్ కేంద్రంగా ఉన్న ఒక వ్యాపార సంస్థపై జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు దాడి చేసి 257 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు దేశంలో అదే పెద్ద మొత్తం. అలాగే తమిళనాడులో ఒక నిర్మాణ సంస్థపై ఐటీ అధికారులు 2018లో దాడి చేసి రూ.153 కోట్లను పట్టుకున్నారు. ఈ రికార్డులన్నీ ఒడిశా ఐటీ దాడితో తుడిచిపెట్టుకుపోయాయి. కాగా ఈ నెల 6న ప్రారంభమైన ఐటీ దాడులు ప్రధానంగా బల్దేయో సాహు ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుబంధంగా ఉన్న బౌద్ధ్ డిస్టిలరీ ప్రైవేట్ లిమిటెడ్ (బీడీపీఎల్)పై కొనసాగాయి. కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ ప్రసాద్ సాహూకు చెందిన రాంచి, ఇతర ప్రదేశాల్లోని సంస్థలపై కూడా దాడులు జరిగాయి. అయితే వాటి నుంచి ఎంత నగదు, ఏం పత్రాలు స్వాధీనం చేసుకున్నారో ఐటీ అధికారులు ఇంకా వెల్లడించ లేదు.

### రాహుల్ నోరు విప్పరేం?

దేశీయ మద్యం అమ్మకాల ద్వారానే లెక్కల్లో చూపని ఇంత మొత్తాన్ని బిజినెస్ గ్రూప్, డిస్ట్రిబ్యూటర్లు, ఇతరులు ఆర్జించినట్టు అధికారులు తెలిపారు. కాగా, కాంగ్రెస్ ఎంపీ వ్యాపార ప్రాంగణాలపై ఐటీ దాడుల ద్వారా రూ.వందల కోట్ల అక్రమ సొమ్ము బయటపడుతున్నా ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు నోరు మెదపడం లేదని కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి ఆదివారం ప్రశ్నించారు. దాడులపై కర్ణాటక సీఎం సిద్దరామయ్య స్పందిస్తూ కేంద్రం ఒక్క కాంగ్రెస్ నేతలనే ఎందుకు టార్గెట్ చేస్తున్నదని, బీజేపీ వారి జోలికి ఎందుకు వెళ్లడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### నల్లధనంపై ధీరజ్ పాత ట్వీట్ వైరల్

ధీరజ్ సాహూ సంస్థల్లో పెద్దయెత్తున నల్లధనం పట్టుబడిన క్రమంలో ఆయన గత ఏడాది ఆగస్టు 12న నల్లధనంపై చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. బీజేపీ నేత అమిత్ మాలవీయ ఎక్స్‌లో ఆ పాత పోస్ట్‌ను ఉంచారు. 'పెద్ద నోట్ల రద్దు తర్వాత కూడా ఇంత పెద్ద యెత్తున నల్లధనం, అవినీతి చూస్తే నాకు బాధేస్తున్నది. అసలు ఇంత పెద్ద మొత్తంలో నల్లధనాన్ని ఎందుకు పోగేసుకుంటున్నారో నా మస్తిష్కానికి అందడం లేదు. ఒక్క కాంగ్రెస్ మాత్రమే ఈ అవినీతిని కూకటి వేళ్లతో పెకిళించగలదు' అని ఎంపీ ధీరజ్ సాహూ గతంలో ట్వీట్ చేశారు.

# ఆర్టికల్ 370పై నేడు తీర్పు

- ప్రకటించనున్న సుప్రీంకోర్టు
- జమ్ముకశ్మీర్‌లో భద్రత కట్టుదిట్టం
- తీర్పు సానుకూలంగా వస్తుందని గుప్కార్ కూటమి ఆశాభావం
- కోర్టు తీర్పును అందరూ గౌరవించాలని బీజేపీ సూచన




న్యూఢిల్లీ, డిసెంబర్ 10: జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ పరంగా చెల్లుబాటు అవుతుందా అన్న అంశంపై సుప్రీంకోర్టు సోమవారం తీర్పు వెలువరించనున్నది. కేంద్రం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తమ నిర్ణయాన్ని ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. 2019 ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 370ని రద్దు చేసింది. జమ్ముకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. కేంద్రం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలువురు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. 16 రోజులపాటు సుదీర్ఘ వాదనలు విన్న సీజేఐ ధర్మాసనం.. సెప్టెంబర్ 5న తీర్పును రిజర్వ్ చేసింది. న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, సంజీవ్ ఖన్నా, బీఆర్ గవాయ్, సూర్యకాంత్‌లు ఈ ధర్మాసనంలో ఇతర సభ్యులు.

### వాదోపవాదాలు..

విచారణ సందర్భంగా పిటిషనర్లను సుప్రీంకోర్టు పలు కీలక ప్రశ్నలు వేసింది. రాజ్యాంగ పరిషత్తు ఉనికిలో లేనప్పుడు, అధికరణం 370 రద్దుకు ఎవరు సిఫారసు చేయగలరని ప్రశ్నించింది. ఒక అధికరణ(ఆర్టికల్ 370) తాత్కాలికమైనదని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నప్పుడు.. జమ్ముకశ్మీర్ రాజ్యాంగ పరిషత్తు 1957లో ముగిసిన తర్వాత ఆ అధికరణ ఎలా శాశ్వతం అవుతుందని పిటిషనర్లను అడిగింది. అయితే 370 రద్దును వ్యతిరేకిస్తున్న పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. జమ్ముకశ్మీర్ రాజ్యాంగాన్ని రూపొందించిన తర్వాత రాజ్యాంగ పరిషత్తు ముగిసిందని, ఈ నేపథ్యంలో ఆ అధికరణను రద్దు చేయలేరన్నారు. రాజ్యాంగ పరిషత్తు ముగియడంతో ఆర్టికల్ 370 శాశ్వత హోదా పొందిందని తెలిపారు. అయితే ఈ అధికరణను రద్దు చేయడంలో రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడలేదని కేంద్ర ప్రభుత్వం వాదించింది.

### తీర్పుపై రాజకీయాలొద్దు..

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌లో భద్రతను కట్టుదిట్టం చేశారు. పెద్ద ఎత్తున బలగాలను మోహరించారు. సుప్రీంకోర్టు సానుకూల తీర్పు వెలువరిస్తుందని, ఆర్టికల్ 370ని కోర్టు పునరుద్ధరిస్తుందని గుప్కార్ కూటమి పార్టీలు ఆశాభావం వ్యక్తంచేశాయి. సుప్రీంకోర్టు తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలని.. రాజకీయాలు చేయొద్దని బీజేపీ సూచించింది. సుప్రీంకోర్టు తీర్పు ప్రతికూలంగా వచ్చినా తమ పార్టీ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించిందని, చట్టప్రకారం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఒమర్ అబ్దుల్లా తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చట్ట వ్యతిరేకమైనదిగా తేలుతుందని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ అన్నారు. ప్రజలకు అనుకూలంగా కోర్టు తీర్పు ఉంటుందని డీపీఏపీ అధ్యక్షుడు గులాం నబీ ఆజాద్ చెప్పారు. మత పరమైన సున్నిత సమాచారాన్ని, ఉగ్రవాదాన్ని, వేర్పాటువాదాన్ని ప్రోత్సహించే సమాచారాన్ని వ్యాప్తి చేయొద్దని సోషల్ మీడియా యూజర్లకు అధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు.

## రోజుకు 14 గంటలు పని చేశా

- ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి

న్యూఢిల్లీ: యువత వారానికి 70 గంటలు పని చేయాలని చెప్పి, చర్చకు తెర తీసిన ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి తాజాగా తన పని తీరు గురించి వివరించారు. వారానికి ఆరు రోజులు పని చేసిన కాలంలో తాను రోజుకు కనీసం 14 గంటలపాటు పని చేసేవాడినని తెలిపారు. ఇన్ఫోసిస్‌ను ఏర్పాటు చేసేటపుడు ఉదయం 6.20 గంటలకు కార్యాలయానికి చేరుకుని, రాత్రి 8.30 గంటల వరకు పని చేసేవాడినన్నారు. 1994 వరకు వారానికి ఆరు రోజులు పని దినాలు ఉండేవని, అప్పట్లో తాను వారానికి కనీసం 85 నుంచి 90 గంటలు పని చేసేవాడినన్నారు. 'ఇది నా దేశం, నేను వారానికి 70 గంటలు పని చేస్తాను' అని చెప్పాలని మన దేశ యువతను కోరారు.

## 10 నిమిషాలకో పిల్లాడికి క్యాన్సర్!

› మొదటిపేజీ తరువాయి...

*క్యాన్సర్ బాధిత పిల్లల్లో 80 శాతం బతుకుతున్నారు. డబ్ల్యూహెచ్‌వో నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న 0 నుంచి 21 ఏండ్ల వయసున్న పిల్లల్లో 20 శాతం మంది భారత్‌లోనే ఉన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో 80 శాతం మంది పిల్లలు క్యాన్సర్‌ను జయిస్తుంటే.. మన దేశంలో ఆ సంఖ్య 30 శాతం కూడా దాటడం లేదు. పెద్దలతో పోలిస్తే క్యాన్సర్ మహమ్మారి నుంచి పిల్లలను కాపాడటం కొంత సులభమని వైద్య నిపుణులు చెబుతున్నా.. మన దేశంలో అందుకు తగిన సంఖ్యలో వైద్యులు, వైద్య సదుపాయాలు లేకపోవడం ఆందోళనకర అంశం.*

### పొగాకు సేవించడం వల్లే 33% మందికి..

*పెద్దల విషయానికి వస్తే భారత్‌లో ప్రతి ఏడాది 13 లక్షల మంది క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్(ఐసీఎంఆర్) నివేదిక ప్రకారం ప్రతి 5 ఏండ్లకు క్యాన్సర్ రోగుల సంఖ్య 12 శాతం పెరుగుతున్నది. ఎక్కువ శాతం మంది పొగాకు సేవనం కారణంగా క్యాన్సర్‌కు గురవుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. మన దేశంలో 33 శాతం మందికి పొగాకు వల్ల క్యాన్సర్ వస్తున్నదని డాక్టర్లు నిర్ధారిస్తున్నారు. ఆ తరువాత ఊబకాయం వల్ల 20% మంది, వైరస్ వల్ల 16% మంది, జెనెటిక్ (వంశ పారంపర్యం) వల్ల 15% మంది, పౌష్టికాహార లోపం వల్ల 5 శాతం మంది, శారీరక శ్రమ లోపం వల్ల 5 శాతం మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని డబ్ల్యుహెచ్‌వో నివేదిక పేర్కొన్నది. రొమ్ము క్యాన్సర్, ప్రొస్టేట్ క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్‌లు 50 ఏండ్లలోపు వారికి చాలా సాధారణమైందని, క్యాన్సర్ పీడుతుల్లో అత్యధిక శాతం మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయం క్యాన్సర్ వస్తుండగా.. పురుషులు నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులేనని పేర్కొన్నది.*

## ముగ్గురు బాలీవుడ్ నటులకు నోటీసులు

హైదరాబాద్, డిసెంబర్ 10 (నమస్తే తెలంగాణ): గుట్కా కంపెనీల ప్రకటనల్లో నటించిన బాలీవుడ్ నటులు అక్షయ్ కుమార్, షారూక్ ఖాన్, అజయ్ దేవ్‌గణ్‌లకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా అలహాబాద్ హైకోర్టు లక్నో ధర్మాసనానికి తెలిపింది. 2022, సెప్టెంబరులో కేంద్రానికి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు కాలేదని పేర్కొంటూ దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ సందర్భంగా డిప్యూటీ సొలిసిటర్ జనరల్ ఎస్‌బీ పాండే ఈ సమాచారాన్ని న్యాయస్థానానికి తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే ఏడాది మే 9కి వాయిదా వేసింది. అత్యున్నత స్థాయి పురస్కారాలను పొందిన నటులు, వివిధ హోదాలు కలవారు గుట్కా కోసం వ్యాపార ప్రకటనల్లో పాల్గొంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్ గతంలో కోరారు.

## టాటా వాణిజ్య వాహనాల ధర పెంపు

- జనవరి నుంచి అమలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: ప్రముఖ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ తన వాణిజ్య వాహనాల ధరలను పెంచనుంది. 2024, జనవరి 1 నుంచి అన్ని కమర్షియల్ వాహనాలపై మూడు శాతం వరకు ధరలు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఉత్పాదక వ్యయాలు పెరగడంతో ధరల పెంపుదల తప్పలేదని పేర్కొంది. ఈ ధరల పెరుగుదల అన్ని వాణిజ్య వాహనాలకు వర్తిస్తుందని ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, ప్రయాణికుల వాహన తయారీదారులు మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, హోండా, ఆడి లాంటి కంపెనీలు సైతం జనవరి నుంచి ధరలు పెంచనున్నట్టు ఇప్పటికే ప్రకటించాయి.

## కార్గిల్ యుద్ధాన్ని వ్యతిరేకించినందుకే

- నన్ను పదవి నుంచి తొలగించారు
- పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్



న్యూఢిల్లీ: భారత్‌కు వ్యతిరేకంగా కార్గిల్‌లో యుద్ధం చేయాలనే తలంపును వ్యతిరేకించినందుకే తనను పదవి నుంచి తొలగించారని, దేశం నుంచి వెళ్లగొట్టారని పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్ చెప్పారు. భారత్ సహా ఇతర ముఖ్యమైన పొరుగు దేశాలతో సత్సంబంధాలు ఉండాలని తాను చెప్పానని, అప్పట్లో సైన్యానికి నాయకత్వం వహించిన జనరల్ పర్వేజ్ ముషారఫ్ అందుకు అంగీకరించలేదని చెప్పారు. '1993, 1999లలో నన్ను పదవి నుంచి ఎందుకు తొలగించారో నాకు చెప్పాలి. కార్గిల్ యుద్ధ ప్రణాళికను నేను వ్యతిరేకించినపుడు, నన్ను పదవి నుంచి తొలగించారు. నేను చెప్పినదే సరైనదని ఆ తర్వాత రుజువైంది' అని నవాజ్ షరీఫ్ చెప్పారు. తాను మూడు సార్లు ప్రధానమంత్రిగా పనిచేశానని, అప్పట్లో తాను దేశానికి మెరుగైన సేవలందించానని తెలిపారు. అయినప్పటికీ తనను పదవి నుంచి ఎందుకు తొలగించారో తెలియడం లేదన్నారు. ఆ సమయంలో ఇద్దరు భారత ప్రధానమంత్రులు పాకిస్థాన్‌లో పర్యటించారని చెప్పారు.


